సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఓయూ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారి పేర్కొన్నారు.

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆర్టీసీ ఆస్పత్రి ఎన్ఐఎన్, తార్నాకా, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, హుడా, హెచ్ఎండీఏ ప్రాంతాలు. ● మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు.. రవీంద్రనగర్, మోడల్ స్కూల్, ధోబీఘాట్, ఈఎఫ్ఎల్ వెనుకవైపు, మాణికేశ్వరీనగర్ ప్రాంతాలు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.30 వరకు మాణికేశ్వరీనగర్ రోడ్ నంబర్–1 నుంచి 7వ రకు సాయిబాబా దేవాలయం ప్రాంతాలు.
- మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు మెట్టుగూడ పార్కు, రైల్వేక్లబ్, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, అశోక లైబ్రరీ, బొందలగడ్డ, కృపా అపార్ట్‌మెంట్, స్కైలాబ్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.27, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 25, దొండ 35, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 28, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 18, చామగడ్డ 70, మొరంగడ్డ 18, కందగడ్డ 30, సొరకాయ 15, పొట్లకాయ 15, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5.

క్లుప్తంగా...

25న బాడీబిల్డింగ్ పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: యువ బాడీబిల్డర్లను ప్రోత్సహించేందుకు మిస్టర్ ఇండియా సిల్వర్ మెడలిస్ట్ శివ కుమార్, మిస్టర్ వరల్డ్ రాహుల్ స్టీల్ మ్యాన్ క్లాసిక్ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 25న సోమాజిగూడ జయా గార్డెన్స్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. పలు రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఐదు కేటగిరీల్లో 10 విభిన్న వెయిట్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్, సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు మొత్తం రూ.5 లక్షల ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. కాగా, ఇటీవల వరంగల్‌లో జరిగిన కేసీఆర్ కప్ మిస్టర్ తెలంగాణ టైటిల్ గెలిచిన శివకుమార్‌ను పలువురు అభినందించారు.

డిప్యుటేషన్ రద్దు చేయండి

ముషీరాబాద్: రంగారెడ్డి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ నుంచి మేడ్చల్ జిల్లాకు డిప్యుటేషన్‌పై పంపిన సీనియర్ అసిస్టెంట్‌ను తిరిగి రంగారెడ్డి జిల్లా బీసీ అభివృద్ధి శాఖకు రప్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. రంగారెడ్డి జిల్లాలో సిబ్బంది కొరత ఉందని కావున డిప్యూటేషన్‌ను రద్దు చేసి రంగారెడ్డి జిల్లాలోనే సీనియర్ అసిస్టెంట్‌ను కొనసాగించాలని ఆయన కోరారు. రంగారెడ్డి జిల్లాలో ఎస్టాబ్లిషమెంట్ సెక్షన్‌ను జూనియర్ అసిస్టెంట్‌లకు ఇవ్వడం జరిగిందని సీనియర్ సీనియర్ అసిస్టెంట్ చేయాల్సిన ఈ సెక్షన్ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్ చేయడంతో ఇబ్బందులు జరుగుతున్నాయన్నారు.

నేటి నుంచి ఖేలో తెలంగాణ.. జీతో తెలంగాణ

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా అట్టడుగున ఉన్న క్రీడాకారులను వెలికి తీసి వారిలో ఉన్న ప్రావీణ్యాన్ని మరింత వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు పార్లమెంట్ నియోకవర్గాల వారిగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మహంకాళి జిల్లా బీజేవైఎం నగర అధ్యక్షులు మద్దూరి శివాజీ, ముషీ రాబాద్ నియోజక వర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్‌లు తెలిపారు. రాజాడిలక్స్ చౌరస్తా వద్ద గల బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మా ట్లాడారు. ఈ క్రీడా పోటీలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 48 టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొంటాయని, మూడు రోజుల పాటు ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్, దోమలగూడ గగన్‌మహల్ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సారధ్యంలో క్రీడాకారులకు కావాల్సిన సామగ్రి కల్పిస్తున్నట్లు తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో కదలాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత కదలాలని మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో నాగేశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన మాట్లాడే స్వేచ్ఛను, ప్రశ్నించే తత్వాన్ని ఈ రోజు పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టును సైతం ప్రశ్నిస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువత భగత్‌సింగ్ ఇచ్చిన విలువలను ముందుకు తీసుకుపోయేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ మాజీ నగర నాయకులు పార్థసారధి, నాయకులు అంజయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్వహణ భారమై.. పచ్చదనం కరువై

అపరిశుభ్రంగా జీహెచ్ఎంసీ పార్కులు

- కొరవడిన పచ్చదనం, ఆహ్లాదం
- అసౌకర్యానికి గురవుతన్న సందర్శకులు
- దృష్టి సారించని అధికారులు



పద్మారావునగర్ పార్కులో కానరాని పచ్చదనం



చెట్ల నుంచి రాలిన ఆకులను ఊడ్చని దృశ్యం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని జీహెచ్ఎంసీ పార్కులు అపరిశుభ్రానికి నిలయంగా మారుతున్నాయి. పచ్చదనం.. పరిశుభ్రతతో కళ కళలాడాల్సిన పార్కులు కళావిహీనంగా తయారయ్యాయి. రూ. లక్షల్లో ఖర్చుచేసి ఏర్పాటు చేస్తున్న పార్కులకు సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నాయి. పద్మారావునగర్, బోయిగూడ, బోలక్‌పూర్, రాణిగంజ్, గాంధీనగర్, జీరా, మారేడ్‌పల్లి తదితర ప్రాంతాల్లోని పార్కుల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రోజుల తరబడి ఊడ్చకపోవడం, మొక్కలు, చెట్లకు నీళ్ల పట్టకపోవడంతో పా ర్కులు అడవిని తలపిస్తుండటంతో ఇక్కడికి రావాలంటే సందర్శకులు జంకుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని పార్కు అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను కలిసి సమస్యలను విన్నవించినా ఫలితం లేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది లేమీ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం..

సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని పార్కుల నిర్వహణలో సిబ్బంది కొరత కొంత కారణంగా కనిపిస్తోంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా పార్కుల నిర్వహణకు బడ్జెట్ ఆ స్థాయిలో కేటాయింపులు లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగడంతో పాటు కాంట్రాక్టర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పార్కులు అధ్వానంగా తయారవుతున్నాయి. నిత్యం పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడాల్సిన పార్కులు నిర్వహణ లేమీతో అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. చెట్ల నుంచి రాలే ఆకులు, చెత్తా చెదారం, వ్యర్థాలను సకాలంలో తొలగించకపోవడంతో కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. పద్మారావునగర్‌లోని మెయిన్ పార్కు సమస్యలతో సతమతమవుతుంది. చెట్లకు సకాలంలో నీళ్ల పట్టకపోవడంతో అనేక మొక్కలు, చెట్లు ఎండిపోతున్నాయి. బన్సీలాల్‌పేట్ ఫ్లోరా హోటల్ సమీపంలో పురాతన పార్కును అభివృద్ధి చేశారు. లక్షలాది రూపాయల వ్యయంతో పార్కును అందంగా తీర్చిదిద్దారు. అయితే ప్రారంభంతో కొంత బాగానే ఉన్నా ప్రస్తుతం ఆక్కడ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నిర్వహణ లేమీ కారణంగా పార్కు రూపురేఖలు కోల్పోయాయి. ఈ పార్కు ఎప్పుడు తెరుస్తారో ఎవరు తెరుస్తారో.. తెలియక స్థానికులు అయోమయానికి గురవుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

పలు పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. పోలీసులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆకతాయిలు, తాగుబోతులు వీటిని అడ్డాగా చేసుకొని తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న పార్కులను జీహెచ్ఎంసీ నిర్వహణ ఆ స్థాయిలో చేపట్టడం లేదనేది వాస్తవం. జోన్, సర్కిల్ పరిధిలోని పార్కులను జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు సందర్శించి అక్కడి వాకర్స్, సందర్శకుల ఇబ్బందులను తెలుసుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు పార్కులను సందర్శిస్తే అక్కడ పని చేసే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పని చేయడంతో పాటు పార్కులను అందంగా ఉంచడానికి ఆస్కారం ఉంటుందని పలువురి అభిప్రాయపడుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

జీహెచ్ఎంసీ పార్కుల అభివృద్ధితో పాటు పచ్చదనం, పరిశుభ్రత వెల్లువిరిసే విధంగా నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాం. సమస్యలు ఉన్న చోట ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. అక్కడక్కడ నెలకొన్న సమస్యలను అధిగమించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పార్కుల నిర్వహణ విషయంతో ప్రజల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్తాం. పార్కుల నిర్వహణపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

–శ్రీదేవి, జీహెచ్ఎంసీ ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్





బోయిగూడ ఫ్లోరా హోటల్ సమీపంలోని పార్కు దుస్థితి ఇలా

సామాజిక తెలంగాణ అర్థమేంటో రేవంత్‌రెడ్డి చెప్పాలి

ప్రొ. గాలి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: సామాజిక తెలంగాణ, సామాజిక న్యాయం అర్థం చెప్పకుండా దొరల తెలంగాణను అంతం చేద్దాం..సామాజిక తెలంగాణను సాధిద్దామని పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ప్రజలు ఎలా నమ్మాలని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పాదయాత్ర ద్వారా రేవంత్‌రెడ్డి ఏలాంటి తెలంగాణను సాదిద్దామని అంటున్నారో ప్రజలకు స్పష్టం చేయాల్సి ఉందన్నారు. దేశంలోని అన్ని అగ్రవర్ణ పార్టీలు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా అనే సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధంగా, 85 శాతం ఉన్న బహుజనులకు అవకాశాలను కల్పించకుండా కొంత మందిని బానిసలుగా చేసుకుని వారికి ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయం కాదన్నారు. భవిష్యత్ తరాల మార్పు కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం బోధిస్తున్న స్వేచ్ఛ సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సాధించడమే సామాజిక న్యా య లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ కవి రాజలింగం పాల్గొన్నారు.

'స్వామిరామానంద తీర్థ' సందర్శన



సనత్‌నగర్: బేగంపేట బ్రాహ్మణవాడీలోని స్వామి రామానందతీర్థను మహారాష్ట్రకు చెందిన యోగేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. ఇక్కడ నిర్వహించే మోడల్ స్కూల్, మాజీ ప్రధానమంత్రి పీవీ స్మారక గ్రంథాలయంతో పాటు ఆయన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కమిటీ చేస్తున్న సేవలను తెలుసుకుని ప్రశంసించారు. రీసెర్చ్ స్కాలర్స్‌కు ఎంతో మేలు చేకూర్చడంతో పాటు విజ్ఞాన సముపార్జనకు పీవీ స్మారక గ్రంథాలయం వేదికగా నిలవడం పట్ల అభినందనలు తెలిపారు. వారికి కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే వాణీదేవి ఇక్కడి అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యోగేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సురేష్ కూర్మలే, సెక్రటరీ జీబీ వ్యాస్, ప్రిన్సిపాల్ రామన్ దేశ్‌పాండే ఉన్నారు.

ఓయూ వీసీ ఘెరావ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌ను పీహెచ్‌డీ అభ్యర్థులు ఘెరావ్ చేశారు. సోమవారం క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరై ఓయూలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నామని మాట్లాడుతుండగా పీహెచ్‌డీ అభ్యర్థులు వీసీ ప్రసంగానికి అడ్డుతగిలి ఎంతమందికి పీహెచ్‌డీ సీట్లు ఇచ్చారని గొడవకు దిగారు. అప్రమత్తమైన పోలీసులు విద్యార్థులను సముదాయించి కూర్చొబెట్టారు. కార్యక్రమం ముగించుకొని బయటికి వెళ్తున్న వీసీని వెళ్లనివ్వకుండా అడ్డుకొని పీహెచ్‌డీ అర్హత మార్కుల తగ్గింపు విషయమై స్పష్టత ఇవ్వాలని నినాదాలు చేశారు. పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది సహాకారంతో వీసీ వెళ్లిపోయారు.



పోలీసులు, సెక్యూరిటీ భద్రతతో బయటకు వెళ్తున్న వీసీ ప్రొ.రవీందర్

ముగిసిన సేవాలాల్ జయంతి ఉత్సవాలు



ముగింపు వేడుకలో గిరిజనులు, అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో వారం రోజులు జరిగిన సేవాలాల్ జయంతి ఉత్సవాలు ముగిశాయి. సోమవారం ఓయూ క్యాంపస్ ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఢిల్లీ అధికార ప్రతినిధి రామచంద్రుడు, వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

పరారీలోనే కారు డ్రైవర్ శ్రీనివాస్

అమీర్‌పేట: రూ. 7 కోట్లు విలువచేసే వజ్రాభరణాలతో ఉడాయించిన కారు డ్రైవర్ శ్రీనివాస్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇ ందుకోసం ఐదు బృందాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. కారుతో పాటు నగలతో పారిపోయిన శ్రీనివాస్ నగర శివారు ప్రాంతాల్లో ఉండే స్నేహితుల వద్దకు వెళ్లినట్లు సమాచారం తెలిసి అక్కడికి వెళ్లేలోపు తప్పించుకుని పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో అతడి సెల్‌కు ఎవరెవరు ఫోన్లు చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. శ్రీనివాస్ ప్రస్తుతం నగర శివారు ప్రాంతాల్లోనే తిరుగుతున్నట్లు తెలుస్తోందని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు అంటున్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి వినతి



డిప్యూటీ మేయర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

లాలాపేట: ఆస్పత్రి నిర్మాణం చేయాలంటూ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన అఖిల పక్ష నాయకుల బృందం సోమవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ నిర్మాణంలో కూలీలుగా ఉన్న తమ పూర్వీకులు, అప్పటి నిజాం సర్కార్ కూలీల నివాసం కోసం కొంత స్థలాన్ని కేటాయించిందన్నారు. అప్పటి నుంచి అదే ప్రాంతంలో కష్టనష్టాలకు ఓర్చి నివాసాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రస్తుతం 30 వేల జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ఆస్పత్రి లేకపోవడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాణికేశ్వర్‌నగర్(వడ్డెర బస్తీ)లో కమాన్ పక్కనున్న ఖాళీ స్థలంలో ఆస్పత్రి నిర్మాణం చేయాలని కోరారు. స్పందించిన డిప్యూటీ మేయర్ సర్వే నెంబర్ 169 స్థలం విషయమై మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి, ఓయూ వీసీతో చర్చించి హాస్పిటల్ నిర్మాణం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో హరిబాబు, విజయ్ కుమార్, నర్సింహ, శ్రీనివాస్, లింగయ్య, కల్యాణ్, రవితేజ, వేముల మల్లేష్ ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రసూల్‌పురా: ఓ టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బొల్లారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీధర్ వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన వెంకటేష్ (50) గత లోతుకుంటలోని నర్తకి టిఫిన్ సెంటర్‌లో పని చేస్తూ అదే సెంటర్ పైనున్న గదిలో ఉంటున్నాడు. సోమవారం ఉదయం గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు.

'బీఆర్ఎస్ అవినీతికి పాల్పడుతోంది'

చిక్కడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు , రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్‌లో ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నియోజవర్గంలో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు.

ముగిసిన సిరాజుద్దీన్ అంత్యక్రియలు



సిరాజుద్దీన్ భౌతికకాయం వద్ద మంత్రి తలసాని

సనత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత సయ్యద్ సిరాజుద్దీన్ అంత్యక్రియలు సోమవారం సనత్‌నగర్ ఈద్గా వద్ద జరిగాయి. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సిరాజుద్దీన్ ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

సిరిపురం యాదయ్యకు నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమంలో ఓయూలో ఆత్మార్పణ చేసుకున్న విద్యార్థి సిరిపురం యాదయ్య చిత్రపటానికి ఆమ్ ఆద్మీ రాష్ట్ర నాయకులు డాక్టర్ హరిచరణ్ నివాళులర్పించారు. సోమవారం ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద సిరిపురం యాదయ్య స్మారక సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.



నివాళులర్పిస్తున్న డాక్టర్ హరిచరణ్

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

లాలాపేట: వాసవిమాతా కృపాకటాక్షంతో అన్ని శుభాలే కలుగుతాయని లాలాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నేతి రాములు గుప్తా అన్నారు. సోమవారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం వద్ద అమావాస్య అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని, తమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, లక్ష్మణ్‌రావు, వెంకటేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయారెడ్డికి అదనపు బాధ్యతలు



బంజారాహిల్స్: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ తగిన వ్యూహరచన సిద్ధం చేసి నియోజక వర్గాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీలకు ఒక్కొక్కరికి రెండు నియోజక వర్గాల చొప్పున బాధ్యతలు అప్పగించి ఆ నియోజక వర్గాల్లో పార్టీని బలోపేతం చేసి నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం తీసుకురావాలని సూచించింది. ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డికి శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజక వర్గాల బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయా రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి శేరి లింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజక వర్గాల్లో పార్టీని సమన్వయం చేస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే దిశలో బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తానని విజయా రెడ్డి అన్నారు.

కన్నీటి సంద్రమైన కంటోన్మెంట్

- ముగిసిన సాయన్న అంత్యక్రియలు
- తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న అల్లుడు చందు

రసూల్‌పురా: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతితో ఆ ప్రాంతమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. జనాదరణ పొందిన నాయకుడిగా ముద్రవేసుకున్న సాయన్న పార్థివదేహం అశోక్‌నగర్‌లోని నివాసం నుంచి కార్ఖానలోని క్యాంపు కార్యాలయానికి సోమవారం ఉదయం 11.45 ని.లకు చేరుకుంది. అప్పటికే అక్కడ వందలాది మంది కార్యకర్తలు, నాయకులు, అభిమానులు వేచి ఉన్నారు. మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, కడియం శ్రీహరి, తీగల కృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ పద్మరావు, చైర్మన్లు గజ్జెల నాగేష్, మన్నే క్రిషాంక్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, మైనంపల్లి హన్మంతరావు, మాజీ మంత్రి మర్రి శశిధర్ రావు, కార్పొరేటర్లు, నాయకులు మర్రి రాజశేఖర్ రెడ్డి, బొల్లు కిషన్, ముప్పిడి గోపాల్, శ్రీ గణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రభాకర్, నళిని కిరణ్, పాండుయాదవ్, శ్యాంకుమార్, లోక్‌నాథ్, తలసాని సాయికిరణ్, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, మంద కృష్ణ మాదిగ నివాళులర్పించారు.

ఊరేగింపుగా మారేడుపల్లి శ్మశానవాటికకు..

కార్ఖానలోని క్యాంపు కార్యాలయం నుంచి సాయన్న పార్థివదేహాన్ని పలువురు నాయకులు కార్యకర్తలు కార్ఖాన ప్రధాన రోడ్డు వరకు మోసారు. కార్ఖాన ప్రధాన రోడ్డులో అంతిమ యాత్ర ప్రారంభమైంది. సికింద్రాబాద్ క్లబ్, పికెట్ అంబేడ్కర్ చౌరస్తా, లక్ష్మీనగర్, ఘన్‌శ్యాం సూపర్‌మార్కెట్, ఏటీసీ గేట్, మహేంద్రహిల్స్ రోడ్ నుంచి మారేడుపల్లి శ్మశనవాటికను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతిమయాత్రలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మరావు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

తండ్రికి స్నేహితుడు.. కుమారుల సహకారం

కంటోన్మెంట్: ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన కంటోన్మెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా 1994లో ఇక్కడికి వచ్చిన సాయన్నకు స్థానిక టీడీపీ నేత, బోర్డు మాజీ సభ్యుడు జక్కుల నర్సింహారెడ్డి అన్నీ తానై సహకారం అందించారు. ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించడంతో పాటు సుదీర్ఘ కాలం ఆప్తమిత్రులుగా ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా మెలిగారు. ఇదే అనుబంధాన్ని జక్కుల కుమారులు మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్), పూర్ణ చంద్రారెడ్డి కొనసాగిస్తూ వచ్చారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన మహేశ్వర్ రెడ్డి కొన్నేళ్లుగా సాయన్నకు చేదోడువాదోడుగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఆయనను ఆసుపత్రికి పిలిపించుకుని మరీ మాట్లాడారు. ఇదే సమయంలో గుండెపోటుకు గురై మరణించారు. అప్పుడు అక్కడే ఉన్న మహేశ్వర్ రెడ్డి అన్నీ తానై వ్యవహరించారు. వీరికి తోడు సాయన్న ముఖ్య అనుచరులు టీఎస్ శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, పనస సంతోష్, సదానంద్, డీఆర్ శ్రీనివాస్ తదితరులు గుండెలవిసేలా రోదిస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



అంత్యక్రియలకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు



తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు